# వింత విలువలు

"కోట్లకొద్ది డబ్బును దుర్వ్యయంచేసి తాజ్‌మహల్ నిర్మించినవాడు కేవలం బుద్ధిహీనుడు మాత్రమే ననిపిస్తుంది. ఒక్క డబ్బునేకాక, లక్ష లాది కూలీల శరీర శ్రమనీ, ఆఖరుకు తన వాంఛల్నికూడా బలిచేసికొని చివరకు కట్టిందల్లా పెళ్ళాం శవం మీద ఒక్క గోరీ మాత్రమే కానీ యిన్నిటికీ మూలమైన పెళ్ళాన్ని పొంద గలిగాడా తాజ్‌మహల్ నిర్మాత..." దుఃఖంతో గడ్డకట్టి, అతని హృదయం కూడా తాజ్‌మహల్ మాదిరే శిలామయం అయింది. తాజ్‌మహల్ వునికి, నేటి మానవ జీవితాలని పరిహసించడానికి మాత్రమే తప్ప మరెందుకూ కొరగాదు. తల్చుకుంటే లక్ష తాజ్‌మహళ్ళనుకూడా మానవుడు నిర్మించగలడు, కానీ, గతించిన యవ్వనాన్ని పునరనుభవించ లేడు. యవ్వనం తిరిగి పొందలేనప్పుడు తాజ్‌మహల్ ప్రయోజనం యేమిటీ? ప్రపంచానికి అదో అసహ్యాకరమైన చీడ..." అంటూ ఏకబిగిన తన మామూలు ధోరణిలో వుపన్యాసం దంచుకుపోతున్నాడు 'రోషన్'.

వాడి మాటలు నాకు అతి జుగుప్సను కలిగిస్తాయి ప్రతిరోజూ కానీ ఏమీ చేయడానికి తోచదు... నేను నిమ్మళంగా వాడి వీపు మీద చేయివేసి నిమురుతూ "నీ వెప్పుడూ యిలాంటి అసందర్భ సంభాషణనే మొదలెడతావు రోషన్! పౌరుషాన్ని, యౌవ్వన బలాధిక్యతనీ ధృవపరచుకోవడానికి లెఖ్ఖలేని వుదాహరణలు యిస్తూంటావు కానీ, చూడూ, ప్రతి వ్యక్తియొక్క యవ్వనమూ, ఆఖరికి జీవితాంతంకూడా ఏనాడో ఒక నాడు సిధిలమైపోక తప్పదు. కాని, నీవు నిందించే తాజ్‌మహల్ మాత్రం, పవిత్రమైన అమరప్రేమకి, శాశ్వత ప్రతినిధిగా, అనన్య శోభతో నిలబడ గలుగుతుంది తాజ్‌మహల్‌ని చూస్తే దేవతలు కూడా యీర్ష్యపడతారేమో రోషన్' నీవు అన్నట్లుగా, నీవొక్కడివి కాక, నీలాంటి వాళ్ళు సవాలక్షమంది యేకమైనప్పటికీ ఒక్క తాజ్‌మహల్‌ని

రచన
మోరియా హీరాలాల్ రాయ్

అనువాదం.
చంద్రం

నిర్మింపచేయలేరు సుమా ' నీ భావ జగత్తులో వున్న తాజ్‌మహల్ యీ శిలా నిర్మితమైన తాజ్‌మహల్‌తో యేనాడూ సరితూగలేదు. నీలాంటి వాడు యీ నిజాన్ని గమనించలేడు స్త్రీ అభిజాత్యం యొక్క అమూల్యత్వాన్ని గ్రహించలేరు నిన్నిలా సంకుచిత వాదంలో, నీ ధనం, నీ సంపద మాత్రమే బంధించి వుంచాయి అందుకే నీవు ఆడవాళ్ళ నో వైపూ, వెండీ బంగారం ముక్కల్ని మరో వైపు వేసి తూస్తుంటా వెప్పుడూ. నీ శరీర తాపోపశమనం కోసం రోజుకో కొత్త వయసు కత్తెని పంజరంలోకి తెస్తావు బాధలు మరచిపోవడానికి రోజు కెంత మత్తుని అనుభవిస్తావు. తాజ్‌లాంటి మహోన్నత శిల్పాన్ని, దోషభూయిష్టం, మూర్ఖమైన నీ చర్యల్ని నీవే స్తోత్రం చేసుకుంటూ అవహేళన చేస్తుంటావు రాను, రాను, నీవు మానవజాతికి మచ్చగా తయారవుతున్నావు." అని సాధ్యమయినంత తక్కువ స్థాయికి కంఠాన్ని తగ్గిస్తూ, అవసరమైన కటువుగా అన్నాను

ఈ మారు రోషన్ గొంతు బాగా పెద్దదిగాచేసి, తన అసహ్యాన్నంతా వెళ్ళగక్కుతూ యిలా అన్నాడు.

ఊరికే నీవేదో అరుస్తున్నావుకాని, నిజంగా నాకా మొగల్ రాజులంటే పరమాసహ్యం. ఓ వైపు విశాల సుందర భవనాల్లో, అందమైన కన్యల్ని నింపి బంధిస్తూ, మరోవైపు అనుభవించవలసిన రాజకుమారులమీద అనేక నిర్భందాలను విధించేవాళ్ళు. వీళ్ళనే నీవు భట్టుమూర్తిలా స్తోత్రం చేస్తున్నావు. అనార్కలీలాంటి అందాల దేవతని జీవ సమాధి చేయించిన క్రూరులు. స్త్రీకి ఇటుక బెడ్డ మాత్రం విలువనీయక, సౌందర్యాన్నీ, వాంఛలనీ, పరిహాసం చేసి, ఇతరుల జీవితాలనూ, యౌవనాలనూ కూడా బతికుండగా పాతిపెట్టించి, స్వార్థంతో కళ్ళుమూసుకుని, సంతోషించినవాళ్లు మొగల్ చక్రవర్తులు. ఏమంటావ్ ? చెప్పు ..........' ఆ క్రూరులైన మొగల్ చక్రవర్తులకన్నా నేనే చాలా మంచివాణ్ణి, అదృష్టవంతుణ్ణి కూడా ఒక్క అనార్కలీ మాత్రమేకాదు రోజుకో కొత్త అనార్కలీని నేను ప్రేమిస్తాను ప్రేమించ బడుతుంటాను.

రోషన్ పై మాటలు,బహుదర్పంతో, మీసాలు మెలేస్తూ అన్నాడు. నాకు వాడి మాటలమీద అసహ్యంతోపాటు, వాడి ఆత్మగర్వాన్ని దెబ్బతీయాలనే ఆలోచన కూడా బలంగా నాటుకుంది

"నీవు మళ్ళీ నీ మూర్ఖత్వాన్నే నిరూపించు కుంటున్నావు రోషన్ ! నీవు ప్రేమించే అనార్కలీల్లో నీకోసం జీవ సమాధికి సిద్ధపడేది ఒక్కతన్నా వుందా? నీవు ప్రతి నిత్యం అనుభవించే బజారు స్త్రీలని 'అనార్కలీతో సరిపోల్చడం... ఆవిడనీ, అమర ప్రేమనీ, అవ

హేళన చేయడం తప్ప మరేమీకాదు. 'అనార్కలీని జీవసమాధి చేయించిన అక్బరు కూడా ఇలా ఆవిణ్ణి అవమాన పరచి వుండ దనుకుంటాను కాలం ఒత్తిడికీ, పరిస్థితులు సృష్టించిన విధిలేని తనానికీ లొంగి, ఆవిడ సలీం రాకుమారుడికి తన ప్రేమని చవిచూపించలేక పోయింది. కాని, జీవితాన్నే త్యాగంచేసి, సలీం హృదయంలో త్యాగశక్తినీ, మానవత్వాన్నీ, సృష్టించింది జహంగీర్ న్యాయ సిద్ధాంతం (అదలె జహంగీర్) ఆ విధాన ఫలితమే అది ఆచంద్ర తారార్కం నిలబడి వుంటుంది నీవుగానీ, శతాధిక సంఖ్యలో వున్న నీ అనార్కలీలు గానీ, చిరకాలం మనగలరా అని. ' ఇప్పుడు నీవు అనార్కలీలుగా భావిస్తున్న వీరంతా వీధుల్లో యెందరో సలీం రాకుమారుల కౌగిళ్ళల్లో కరిగింతర్వాతనే నీదాకా వచ్చారు దయవుంచి ఇక ముందలా మాట్లాడకు" అని చాలా విసురుగా అన్నాను

అసలు 'రోషన్' ఒకానొక శాపగ్రస్త ధనికకుటుంబాన్ని ఉద్ధరించడానికి వెలిగిన కరదీపిక. కాని, వాడు చిన్నప్పటి నుంచి యిప్పటి వరకు యెన్నో రూపాలూ, రంగులూ మార్చాడు. రచయితగా, కళాకారుడుగా పేరెన్నిక గన్నాడు వ్యభిచారం, దగాకోరుతనంలో మా వాడు ప్రసిద్ధికెక్కిన చేయి. దౌర్భాగ్యవ్యాధులు వాడిరక్తంలో సమ్మిళితమై వుంటాయి. పాపానికి సంబంధించిన విషక్రిములు,వాడి నర నరాలకూ పాకిపోయిన మూలంగా యీ నాడు వాడో పెద్దదయ్యంలా మారిపోయాడు ఎంతసులభంగా రోజుకో స్త్రీని వాడు మార్చగలడో అంత సులభంగానే రోజుకో రాజకీయ పక్షానికీ మారుతుంటాడు రాజకీయ కార్యకర్తలకి దబ్బాళ చూపించి బ్రోకరు పనులు నిర్వర్తింప చేసుకుంటాడు చిట్టచివరకి యీ జీవితసమయంలోనే వాడు రెండు ఘూడు ఖూనీలనికూడా చేశాడు కాలం, ప్రతిక్షణం కొరడాతో వాణ్ణి ఝుడిపిస్తున్నప్పటికీ భయపడడంలేదు.

ఈ మధ్యకాలంలో మట్టుకు ఎందుకో వాడి ప్రవర్తనలో కొంత పరివర్తన వచ్చిపడింది. ఆ కాలంలో మాత్రం వాడు తన పాపాలను ప్రజలముందుంచి, హృదయక్షాళనం చేసుకుంటూండేవాడు తన నొక కళాకారుడుగా, రసపిపాసువుగా భావించమని ప్రజల్ని అర్థిస్తూండేవాడు 'రోషన్' మారిపోయాడని అంతా అనుకున్నారు తల్లిదండ్రులూ, బంధువులూ, అంతా సంతృప్తిపడ్డారు.

ఇలా కొన్ని సంవత్సరాలు మాత్రమే గడిచాయి

అనంతరం హటాత్తుగా వేలాది రూపాయిల విలువచేసే ఆస్తికి అదృష్టవశాత్తూ, రోషన్ వారసుడు కావడంతో, వీడిలో అంతర్భూతమై వున్న దుర్గుణాలు తిరిగి పెట్లసాగినై వాడి మంచిని గోరే

స్నేహితులంతా శత్రువు లైపోయారు. డబ్బుతో పాటుగానే, రౌడీలూ, గూండాలూ, పాపాలూ, రోషన్ చుట్టూ పోగుపడడం మొదలైంది.

అసలు వాడొక జమీందారు. తన పాపాలకి ధనంరంగును పూసి మరోలా కనిపించేట్లు చేసుకున్నాడు. ప్రస్తుతం, జమీందారీ విధానం నశించి, రాజకీయ పక్షాల పలుకుబడి హెచ్చడంతో, వెంటనే వాడు తన ధనబలంతో ఒక సాధారణ రాజకీయ పక్షానికి నాయకుడుగా మారి పోయాడు. పనిలేని సోమరిపోతులు కొందరు కార్యకర్తలుగా చేరారు.

రోషన్‌లో వచ్చిన యీ పరిణామం మూలంగా నేను పడుతున్న యాతన, మానసికంగా ప్రస్తుతం అనుభవించే వేదన, భరించడానికి వీలులేకుండా వుంది ఒక్కొక్క బజారు స్త్రీ మెప్పు పొందడానికి వాడు వెయ్యిరూపాయిలైనా ఖర్చు పెట్టడానికి వెనుతీయడు, కానీ, నిరుపేద స్నేహితు డెవడన్నా అవసరం వుండి యాచిస్తే పైసా విదిలించడు. వాడి పాపకృత్యాలు వాణ్ణి మనిషిగా రూపించలేనంత గాఢంగా చుట్టూ అలుముకున్నాయి. వాడీవాళ ఒక మేధావి వర్గానికి చెందిన రాజకీయ గుండాగానూ, మొదటి రకం దౌర్భాగ్యుడిగాను ప్రఖ్యాతివహించి విపరీత భావనా ప్రవాహంలోబడి కొట్టుకు పోతున్నాడు. పూర్వాశ్రమంలో స్నేహితుల గడపల్లో పడికాపులు పడ్డవాడు



"నెక్‌లెస్ చక్కా పారేసుకు వచ్చావ్!
ప్చ్ ప్చ్ నేను నా జీవితంలో ఇంత వరకు ఒక్క వస్తువైనా పోగొట్టుకున్నట్టు ఎవరైనా రుజువు చేస్తే నా చెవి కోయించుకుంటాను"

"ఎవరో కాదు, నేనే రుజువు చెయ్యగలను, కాని మీ బోడిచెవి నాకవసరంలేదు; మీరు పోగొట్టుకున్నది ఒక్కటే ఒక్కటి అది మీ 'పరువు'"

- - - - - -

యిప్పుడు తన బజారు స్త్రీలకోసం సంవత్సరానికి పదివేల రూపాయిల సిల్కు వస్త్రాలని అవలీలగా కొనేస్తున్నాడు. తీరిక సమయాల్లో సౌధాల్లో, స్నేహితుల ముందు కూర్చుని, అనార్కలీనీ, తాజ్ మహల్‌నీ, అవహేళన చేస్తుంటాడు వాడి తర్డుక్లాసు ప్రియురాళ్ళని, మొగల్ రాజకన్యల స్థానంలో నిలబెడుతాడు.

యెవరైనా స్త్రీలు తన వద్దకువస్తే, తిరిగి వెళ్ళడానికి యెన్నడూ వాంఛించ

దనీ, యిది తన యౌవన మహత్యమనీ దాదాపు యాభైమంది అనార్కలీ లాంటీ వాళ్ళు యివాళ తన అంతఃపురంలోవున్నారనీ, యింకా. బతకదల్చినవా డెవడూ వాళ్ళని, కన్నెత్తిచూడడనీ, తనొక్కసారి కనిపిస్తేనే చాలునని కోరుతూ లక్షలాది వుత్తరాలు స్త్రీలదగ్గరనుంచి, త న కు వస్తుంటాయనీ, తీరికగా వున్నప్పుడల్లా కోస్తుంటాడు.

రోషన్ మాటలమీదా, కోతలమీదా, రాను రాను, నాకు విశ్వాసం సన్నగిల్లుతూవచ్చి చివరకు అసలునమ్మలేని దశకు వచ్చేశాను. వాడిజీవితానికి, ఉంపుడు గత్తెలకీ, సంబంధించిన రహస్యాలను, కనుక్కోవాలనే ఉబలాటం ఒక్కోసారి నాకు కలుగుతోండేది.

ఇటీవల మెల్ల మెల్లగా, వీడి చరిత్ర పరిశోధించడం మొదలెట్టాక నాకు చాలా సంగతులు తెలిశాయి. వీడి ఉంపుడు గత్తెలు నిజానికి వీడి డబ్బుతోనే బతుకుతున్నప్పటికీ, వీళ్ళందరినీ వీడి గుండా రాజకీయ కార్యకర్తలే ఉపయోగించుకుంటారు. ఇంకా లోతుగా విచారిస్తే, ప్రస్తుతం వీడు కేవలం స్త్రీ బాహ్యా సౌందర్యాన్ని ఆరాధించడం తప్ప, అనుభవించే పరిస్థితిలో లేడని కూడా తేలిపోయింది. యీ నగ్నసత్యం నాకు విపరీతమైన ఆశ్చర్యాన్ని కలిగించింది

వాడికి సంబంధించిన ప్రియురాలితో వేళా విశేషంగా మాట్లాడ్డం తటస్థించింది.

"నాలుగైదేళ్ళ నుండీ రోషన్‌తో వుంటూన్నప్పటికీ, నీ కింకా సంతానం కలగలేదేమని" పూరికేనే చమాత్కారంగా అడిగాను. అందుకు నే నాశించిన ప్రత్యుత్తర మిచ్చిందావిడ చిరునవ్వుతూ

"మీకేం తెలుసుకానీ, రోషన్ ఒక పసికుర్రవాడికన్నా అన్యాయం అతనికి మరోపిల్లవాడు జన్మించడానికి ఆస్కారం లేదు స్త్రీలను కూడదీసి పోషిస్తూ, మగవాణ్ణని అనిపించుకోవాలని ఆయన సరదా, కాని, స్త్రీ ముందు నిలబడడానికి కూడా అ త ని కి ధైర్యం వుండదు. మూత్ర విసర్జనకి కూడా ఆయనకి ఇంజక్షన్ సహాయం అవసరం అవుతుంది. ఇక సంతానం కలిగించేందుకు, ప్రత్యేకించి అతని నిమిత్తం దేవుడే ఒక కొత్త యి ం జ క్ష న్ని సృష్టించాలి. ఇదంతా పాపానికి ఫ లి త ం. "అంటూ, మీరు రోషన్ స్నేహితులేగదూ ? ఎవరైతేం, అప్పుడప్పుడు వచ్చి చూచి పోతూండండి' అందా యువతి.

యధాప్రకారం ఒకనాడు రో ష న్ మాయింటికి వచ్చి మళ్ళీ గప్పాలు దంచడం మొదలెట్టాడు. షాజహాను తన ప్రియురాలి కోసం తాజ్‌మహల్ నిర్మించి, కోట్లద్రవ్యం దుర్వినియోగపరచి, పిచ్చి పనిచేశాడనీ, నిజంగా అయితే ఆడబ్బుతో మరో వేయిమంది ముంతాజ్ మహళ్ళని సంపాయించి ఆనందం పొందే వాణ్ణనీ. అన్నాడు.

నా కోపం హద్దుమీరిపోయింది. "నీవు బజారు ముండల్ని అలంకరించి వాళ్ళని ఆవుపెయ్యల్లా మేపడం తప్ప మరేమీ చేయలేవు. నీవో పెద్ద ప్రణయారాధకుడివిగా, మగాడివిగా, లోకంచేత గుర్తింపబడాలని ఉబలాటపడుతున్నావు. నీకు నిజంగా స్త్రీ అంటే యేమిటో తెలీదు. కులస్త్రీకీ, వేశ్యలకీగల తారతమ్యం ఇక నీకేం తెలుస్తుంది...? నీ యౌవ్వనబల నిజరహస్యం, నీ కోతలూ, నీదర్పం, లోకానికంతటికీ తెలుసు కాని అధికంగా మాట్లాడకు." అన్నాను విపరీతకర్కశ స్వరంతో.

నామాటలు వినటంతోనే, రోషన్ శిలాప్రతిమలా మారిపోయాడు. వాడి శరీరం చెమటలు కక్కడం మొదలెట్టింది. తలతిరిగి కింద పడిపోతాడేమోననే భయం వేసింది నాకు. వెంటనే వాణ్ణి, నా కార్లో చేర్చి నౌకర్నిచ్చి కొంపలో దింపించాను.

పాపం! వాడి జీవితంచూస్తే నాకు నవ్వూ, జాలీ వేస్తూంటాయి. ఇక వాడు సంస్కరింపబడే అవకాశంలేదు. సంస్కరింపబడే దిక వాడి కోసం నిర్మింపబడే ఆరడుగుల గహ్వారంలోనే, పట్టణం యావత్తూ అసహ్యించుకొంటూ వున్నప్పటికీ, వాడి ప్రవర్తనను మార్చుకోడు. బుద్ధిహీనులైన స్నేహితులు కలసినప్పుడల్లా, వాడు తన యౌవ్వనబలాన్ని ధృవపరచే ఉదాహరణలు ఏకరువు పెడుతూంటాడు కుక్కతోక వంకరే నన్నది అబద్ధంకాదు సిగ్గులేనితనానికి లోబడ్డ వీడి జీవితంచూసి, మృత్యువుకూడా సిగ్గుపడుతూంటుంది. కాని, ఏనాటికైనా, యీ వున్మత్త భారకుడు, భగవంతుడి భయంకర కరాయుధానికి తలొగ్గక తప్పనిసరి అని తెలిసినప్పుడల్లా నాకు తెగ జాలి వేస్తూంటుంది

వాణ్ణిగురించి ఆలోచించడం కాలాన్ని దుర్వ్యయం చేయడమే. ఆలోచిస్తే మాత్రం ఆత్మతృప్తి కోసరమే వాడీ దౌర్భాగ్యచర్యలు జరుపుతున్నాడనీ, వాటి నుంచి వాడిక విముక్తి నొందడం దుస్తరం అనిపిస్తుంది. ఆ వీధిఅనార్కలీలంతా వాడి మృతిని సంతోషంగా స్వీకరించే సమయం వుందని తెలిశాక నా గుండె జలదరిస్తుంది. ఇక వాణ్ణి గురించి ఆలోచించడం సంపూర్ణంగా మానేస్తాను.

వాడికి విముక్తంటూవుంటే అది శాశ్వత విముక్తే...

